ఆటల్లో మేటి

ఒకవైపు చదువులో రాణిస్తూ మరో వైపు వివిధ క్రీడాంశాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు బుల్లయ్య కళాశాల విద్యార్థులు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తామంటున్నారు. ఇప్పటికే జిల్లా, యూనివర్సిటీ, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బుల్లయ్య విద్యార్థులు పాల్గొంటే పతకం ఖాయమన్నట్టు సాధిస్తున్నారు. దీనికి కారణం ఆటలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ఇస్తున్న ప్రోత్సాహమే. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, కిక్ బాక్సింగ్, బాడీ బిల్డింగ్, వాలీబాల్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, కరాటే, హాకీ, క్రికెట్, స్కేటింగ్, యోగా, లాంగ్ టెన్నిస్, బ్యాడ్మింటన్, తైక్వాండోలో పలువురు విద్యార్థులు రాణిస్తున్నారు. ప్రభుత్వం సరైన వసతులు కల్పించి **ప్రోత్సహిస్తే అంతర్జాతీయ వేదికలపై కూడా తమ సత్తా చాటుతామంటున్నారు కళాశాల విద్యార్థులు.** – సీతంపేట

- క్రీడల్లో రాణిస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో పతకాలు
- ప్రోత్సహిస్తున్న కళాశాల యాజమాన్యం


స్కేటింగ్‌లో రాణిస్తున్న లక్షితారెడ్డి

స్కేటింగ్‌లో లక్షితా రెడ్డి ప్రతిభ

బుల్లయ్య కళాశాలలో బీఎస్సీ చదువుతున్న మల్లెల లక్షితారెడ్డి స్కేటింగ్, యోగా, కరాటేలో పలు పతకాలు సాధించింది. 2022లో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలో సిల్వర్ మెడల్, 2023లో నేపాల్‌లో జరిగిన అంతర జిల్లాల ఫిగర్ స్కేటింగ్, కరాటేలో బంగారు పతకం, 2024 ఆగస్టులో ఢిల్లీలో జరిగిన ఐస్ స్కేటింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. 2022లో శాప్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. 2023లో యూనివర్సిటీ గేమ్స్ యోగాలో పాల్గొంది. ఈ నెల 23 నుంచి 27 వరకు కాశ్మీర్‌లో జరగనున్న ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో ఐస్ స్కేటింగ్ పోటీలో పాల్గొననుంది.



మిస్టర్ ఏయూ గోపీచంద్

ఎంసీఏ చదువుతున్న దమ్ము గోపీచంద్ బాడీ బిల్డింగ్‌లో మిస్టర్ ఏయూ టైటిల్ సొంతం చేసుకున్నాడు. విజయనగరంలో గత ఏడాది అక్టోబరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. నవంబరు 4న ఏయూలో **జరిగిన ఇంటర్** యూనివర్సిటీ పోటీల్లో బంగారు పతకం సాధించ**డంతోపాటు 'మిస్టర్ ఏయూ' టైటిల్ సాధించడం** విశేషం. అంతర్జా**తీయ వేదికపై బంగారు పతకం సాధించడమే** తన లక్ష్యమని చెబు**తున్నాడు గోపీచంద్.**


కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న బొంగు కల్పితారెడ్డి

కిక్ బాక్సింగ్‌లో పతకాల పంచ్‌లు

బీఏ రెండో సంవత్సరం చదువుతున్న బొంగు కల్పితా రెడ్డి కిక్ బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపింది. 2023లో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీలో బంగారు పతకం సాధించింది. 2019లో ఎంపీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్, 2022 విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారుపతకం, 2021లో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో సిల్వర్ మెడల్, 2023లో రైల్వే వారు నిర్వహించిన పోటీలో సిల్వర్ మెడల్ సాధించింది. 2023లో మీరట్‌లో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీస్ కిక్ బాక్సింగ్ పోటీలో బ్రాంజ్ మెడల్, 2024లో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో బంగారు పతకం సాధించింది.



పవర్ లిఫ్టింగ్‌లో అద్భుత ప్రతిభ

ఎంబీఏ సెకండియర్ చదువుతున్న మామిడి దుర్గాప్ర**సాద్ పవర్ లిఫ్టింగ్‌లో అద్భు**త ప్రతిభతో ఎన్నో పతకాలు కైవసం **చేసుకున్నాడు. గత ఆరేళ్లుగా** పవర్ లిఫ్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ పొం**దుతున్నాడు. 2022లో** న్యూజిలాండ్‌లో జరిగిన కామన్‌వెల్త్ **గేమ్స్‌లో 93 కిలోల విభా**గంలో బంగారు పతకం సాధించాడు. **2023లో కేరళలో జరిగిన** ఏషియన్ మెన్స్ చాంపియన్‌షిప్‌లో **బ్రాంజ్ మెడల్, 2022లో హైదరాబాదు**లో జరిగిన జూనియర్ నేషనల్ పవర్ **లిఫ్టింగ్‌లో చాంపియన్‌షిప్ పోటీల్లో** బ్రాంజ్‌మెడల్ సాధించాడు. రానున్న మే **నెలలో జరగనున్న జూనియర్ వరల్డ్** కప్ పోటీలకు సిద్ధమవుతున్నాడు. **స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో జాబ్** సంపాదించాలన్నది తన **లక్ష్యమని దుర్గాప్ర**సాద్ చెబుతున్నాడు.



బాక్సింగ్‌లో తలపడుతున్న కలవలు కల్పితా రెడ్డి, హర్షితా రెడ్డి

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా...

బీఏ రెండో సంవత్సరం చదువుతున్న బి.హర్షితా రెడ్డి కిక్ బాక్సింగ్‌లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా శిక్షణ పొందుతోంది. 2023లో మీరట్‌లో జరిగిన ఆల్ ఇండియా లెవెల్ పోటీలో బంగారు పతకం, 2024లో విశాఖలో జరిగిన నేషనల్ యూనివర్సిటీ గేమ్స్‌లో బంగారు పతకం, ఏయూలో జరిగిన ఆల్ ఇండియా సెలక్షన్స్‌లో బంగారు పతకం, 2021లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో బ్రాంజ్ మెడల్ సాధించింది. 2028 ఒలింపిక్స్‌లో పాల్గొని పతకం సాధించడం తన లక్ష్యమని చెబుతోంది.


పవర్ లిఫ్టింగ్‌లో సాధన చేస్తున్న మామిడి దుర్గాప్రసాద్

వెయిట్ లిఫ్టింగ్‌లో తరుణ్ అదుర్స్

బుల్లయ్య కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.తరుణ్ ఆటల పట్ల తనకున్న ఆసక్తితో తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్నో విజయాలు సొంతం చేసుకున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఎన్నో పతకాలు సాధించాడు. 2019లో కడపలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం, 2022లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్నాచ్, క్లీన్ అండ్ జర్క్‌లో కాంస్య పతకం సాధించాడు. 2023 తమిళనాడులో జరిగిన ఐడబ్ల్యూఎల్ఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో 81 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. 2024లో అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో కాంస్య పతకం, హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన యూత్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఏయూలో జరిగిన అంతర కళాశాలల పోటీలో బంగారు పతకం, నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీలో నాలుగో స్థానంలో నిలిచాడు. కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా తరుణ్ సాధన చేస్తున్నాడు.



వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న ఎం.తరుణ్



కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చూపుతున్న హర్షితా రెడ్డి, కల్పితారెడ్డి

17 ఏళ్లుగా చాంపియన్‌షిప్

కళాశాలలో 20కిపైగా క్రీడల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా శిక్షణ ఇస్తున్నాం. ఇంటర్ నుంచి పీజీ వరకు సుమారు 600 మంది క్రీడాకారులు ఉన్నారు. ఏటా వివిధ పోటీల్లో 20 నుంచి 25 చాంపియన్‌షిప్స్ తమ కళాశాల విద్యార్థులు గెలుపొందుతున్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ విద్యతోపాటు క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యంతోనే ఇంతటి ఘనత సాధ్యమైంది. బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో ఏయూ ఇంటర్ కాలేజ్ పోటీల్లో గత 17 ఏళ్లుగా మహిళలు, పురుషుల విభాగాల్లో తమ కళాశాల క్రీడాకారులు చాంపియన్‌షిప్ సాధిస్తుండటం విశేషం. – వై.శ్రీనివాసరావు, పీడీ, బుల్లయ్య కళాశాల

క్లుప్తంగా

సదరం పునః పరిశీలన శిబిరం ప్రారంభం


నేత్ర వైద్యశాలలో సదరం శిబిరానికి హాజరైన లబ్ధిదారులను పరీక్షిస్తున్న సిబ్బంది

సీతంపేట : డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రామాటాకీస్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సదరం పునఃపరిశీలన ప్రత్యేక శిబిరం మంగళవారం ప్రారంభమైంది. అనకాపల్లి, నర్సీపట్నం, అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన ముగ్గురు ఆప్తమాలజిస్టులు పాల్గొని సదరం సర్టిఫికెట్లను, లబ్ధిదారుల దృష్టి లోపాలను తనిఖీ చేశారు. తొలి రోజు 97 మంది శిబిరానికి హాజరయ్యారు. కంటికి సంబంధించి దృష్టి లోపాలతో సుమారు 2500 మంది లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. రోజుకు వంద నుంచి 150 మందికి స్లాట్స్ మంజూరు చేసినట్టు సిబ్బంది తెలిపారు. ఈ లెక్కన 30 నుంచి 45 రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

కాలభైరవ స్వామికి ఘనంగా పూజలు


పూజలందుకున్న కాలభైరవుడు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిరిడీ సాయిబాబా దేవస్థానంలో మంగళవారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తీసుకొచ్చిన పిండివంటల దండను కాలభైరవ స్వామికి అలంకరించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. అంతకు ముందు గణపతి మహాస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలకు స్పందన


ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈ శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆధార్‌కార్డు తీసుకోని పిల్లలకు ఈ శిబిరాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ మార్పులు, చేర్పులకు రూ.50 వసూలు చేస్తున్నారు. బయోమెట్రిక్ నమోదు నిమిత్తం రూ.వంద వంతున చెల్లించాల్సి ఉంటుంది. చిన్నపిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు చేస్తున్నారు. ఐదు, 15 ఏళ్లు పూర్తయిన పిల్లలు ఫొటో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధి 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్ – 1 నేతాజీపార్కులో గల 106వ నంబరు సచివాలయంలో, మద్దిలపాలెంలో గల 117వ నంబరు సచివాలయంలో శిబిరాలు ప్రారంభించారు. ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125వ నంబర్ సచివాలయంలో, పాత రేసపువానిపాలెంలో గల 138వ నంబర్ సచివాలయంలో కార్యదర్శి లోవరాజు ఆధార్ నమోదు చేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143వ నంబర్ సచివాలయంలో కూడా ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని జోన్ – 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

మద్రిపాలెం : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాలని, ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా 'ఉన్నత్ భారత్ అభియాన్' అనే నినాదంతో శ్రీపాద డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి మంగళవారం 48వ నంబరు బస్టాప్ నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సిగ్నల్స్ వ్యవస్థను తప్పక పాటించాలని, కార్లు నడిపే వారు సీటుబెల్ట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకుని నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. ర్యాలీలో ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ జయశీల, హోంగార్డు మోహనరావు, శ్రీపాద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో విద్యార్థులు, సీఐ దాశరథి తదితరులు

భారీ స్పీడ్ బ్రేకర్ నుంచి విముక్తి

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ నుంచి వాహన చోదకులకు ఎట్టకేలకు విముక్తి కలిగింది. 'భారీ స్పీడ్ బ్రేకర్‌తో ప్రమాదాలు' శీర్షికతో ఈ నెల 17న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జోన్ – 3 అధికారులు స్పందించారు. ఈ స్పీడ్ బ్రేకర్ కారణంగా ప్రమాదాలు జరగడం తెలిసిందే. ఇక్కడి ఏఎంజీ ఆస్పత్రి సమీపంలో ఇటీవల జీవీఎంసీ జోన్ – 3 ఇంజినీర్లు స్పీడ్‌బ్రేకర్ ఏర్పాటు చేశారు. దీని వెడల్పు ఎక్కువగా ఉండడం, దానిపై రేడియం కలర్స్ లేకపోవడంతో రాత్రి పూట కనిపించడం లేదని.., పగలు, రాత్రి తేడా లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సాక్షిలో ప్రచురించిన వార్తకు స్పందించిన జీవీఎంసీ జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం సిబ్బంది స్పీడ్‌బ్రేకర్‌ను తొలగించారు. సాక్షి కథనంతో అధికారులు స్పందించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నక్కవానిపాలెంలో తొలగించిన స్పీడ్ బ్రేకర్

సర్వీస్ ప్రొవైడర్స్ మేళా వినియోగించుకోండి


సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయం పరిధిలో చేపట్టిన సర్వీస్ ప్రొవైడర్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక కోరారు. ఈ మేరకు జోన్ – 5 యూసీడీ విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆమె ఆవిష్కరించారు. మెప్మా సంస్థ, హోమ్ ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో 'సర్వీస్ ప్రొవైడర్స్ మేళా' నిర్వహిస్తున్నారని తెలిపారు. జోనల్ కమిషనర్ రాము మాట్లాడుతూ మొదటి దశలో వడ్రంగులు, ప్లంబింగ్ సేవలు, విద్యుత్ సేవలు, విద్యుత్ ఉపకరణాలు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను జోనల్ కార్యాలయంలో, ఉత్తర ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జోన్ – 5 యూసీడీ విభాగం ఏపీడీ పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న శ్యామల దీపిక, జోనల్ కమిషనర్ రాము, ఏపీడీ పుణ్యవతి

సిద్ధాంజనేయ స్వామికి సింధూర అర్చన

మురళీనగర్ : జాతీయ రహదారి సూర్యనగర్ – 2లో వేంచేసి ఉన్న యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో స్వామిని మంగళవారం సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు ప్రత్యేక పూజలు, సింధూర అర్చన నిర్వహించారు. సన్నిధిలో భక్తులు సామూహిక సుందరాకాండ పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, కమిటీ సభ్యులు ఎంవీ రాజశేఖర్, భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

విశేష అలంకరణలో సిద్ధాంజనేయ స్వామి



అక్కయ్యపాలెం పరసకు ఏర్పాట్లు

సీతంపేట : అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద బుధవారం సీతారాముల పరసకు గౌరీ సేవా సంఘం ఘనంగా ఏర్పాట్లు చేసింది. భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వెంకటేశ్వర స్వామి, సీతారాముల పరస నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆటంకాలు తలెత్తకుండా కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలు, పూల దండలు, వేప దండలతో అలంకరించారు. బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు అమ్మవార్లకు తొలి పూజతో పరస ఉత్సవం ప్రారంభమవుతుంది. అనంతరం అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకోవచ్చు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 వరకు సాంప్రదాయ కోలాటం, సేవా గరిడీ, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, చెక్క భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పరస మహోత్సవం ఉత్సాహంగా సాగుతుంది. సంఘం గౌరవ అధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, కమిటీ చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ పిల్లా పకీరునాయుడు, కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, ఉపాధ్యక్షుడు బొడ్డేటి ఆనందరావు, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, పిల్లా గోపి, పాలమరశెట్టి ఈశ్వర అప్పారావు, మాదేటి శ్రీనివాసరావు, వీరుబాబు, పాలక వర్గ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


విద్యుత్ దీపాల వెలుగుల్లో అమ్మవారి ఆలయాలు


అక్కయ్యపాలెంలో విద్యుత్ దీపాల వెలుగులు

హయ్యర్ పింఛన్ అమలుకు వినతి

మురళీనగర్ : అర్హత కలిగిన వారందరికీ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఆప్రా) ప్రతినిధులు డిమాండు చేశారు. ఈ మేరకు ఆప్రా రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.దీనబంధు, ఆలిండియా కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు కుమార మంగళంతో కూడిన బృందం విశాఖపట్నం రీజియన్ ఈపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ జాస్తి పవన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. సీపీఎఫ్‌వో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం హయ్యర్ పెన్షన్ కేసుల ప్రాసెస్‌ను వేగవంతం చేయాలని డిమాండు చేశారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరు వచ్చినా అడ్డుకుంటామని, ప్రైవేటీకరణను ఆపే వరకు పోరాడతామని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ తెలిపారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 113వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు ఎవరొచ్చినా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల కృషితోనే ఆస్పత్రి అభివృద్ధి చెందిందన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కె.సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, కె.విజయారావు, నర్సింగరావు పాల్గొన్నారు.


దీక్షలో సీఐటీయూ నాయకులు

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

సీతమ్మధార : రోడ్డు భద్రతా నియమాలు అందరి కుటుంబాలకు రక్షణ కవచాలని, వాటిని పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎస్.అమ్మినాయుడు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ దరి హైవే జంక్షన్‌లో మంగళవారం వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. దూర ప్రాంతాలకు బస్సుల్లో మాత్రమే వెళ్లాలని సూచించారు. అనంతరం హెల్మెట్, సీటుబెల్ట్ ధరించిన వాహన చోదకులకు వీ హెల్త్ కేర్ ఫ్యామిలీ హెల్త్ కార్డులను సీఐ ఎస్.అమ్మినాయుడు, ఎస్ఐ వాణిశ్రీ, ఆర్ఎస్ఐ ఉమా మహేశ్వరరావు, వీ హెల్త్ కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ అందజేశారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అమ్మినాయుడు

డిస్కంల ప్రైవేటీకరణలో భాగమే స్మార్ట్ మీటర్లు

సీతమ్మధార : స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ, నిబంధనలను మార్చుతూ జనవరి 1న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని... ఇదంతా డిస్కంలను ప్రైవేటీకరించడానికేనని విశాఖపట్నం అపార్ట్‌మెంట్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా నివాస్) కార్యదర్శి బీబీ గణేష్, ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. నోటిఫికేషన్‌లో ఏపీ డిస్కంలు అని రాయడానికి బదులుగా డిస్ట్రిబ్యూషన్ లైసెన్సీ అని రాస్తున్నారని ఎద్దేవా చేశారు. అంటే కొత్తగా ప్రైవేటు లైసెన్సీలు వస్తున్నట్లు తెలుస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ గైడ్‌లైన్స్ ప్రకారం స్మార్ట్ మీటర్లు, సంబంధిత డేటా, సేవలు, మౌలిక సదుపాయాలు సరఫరా నిర్వహణ కోసం ఒకే ఏజెన్సీ ఒప్పందం కుదుర్చుకుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ నుంచి మీటర్లు వచ్చాయని తెలిపారు. ప్రైవేటీకరణలో ఇది ముందస్తు చర్య అని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను వార్వా నివాస్ తరఫున వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు.